సాక్షి
తూర్పుగోదావరి

మంగళవారం । 22 । అక్టోబర్ । 2024



సదా వేంకటేశం.. స్మరామి స్మరామి

కోనసీమ తిరుపతి వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.


8లో



స్కూటీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

శుభకార్యానికి వెళ్లి బంధుమిత్రులతో సంతోషంగా గడపాల్సిన ఆ దంపతులిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. స్కూటీని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది.

27 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం సాయంత్రం 27,154 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 7,800 క్యూసెక్కుల నీరు వదిలారు.

న్యూస్‌రీల్

నేడు కొవ్వూరులో జాబ్ మేళా

కొవ్వూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జె.సునీత తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డిగ్రీ కళాశాల సంయుక్తాధ్వర్యంలో ఈ జాబ్ మేళా జరుగుతుందని చెప్పారు. వరుణ్ మోటార్స్, అపోలో ఫార్మసీ, ఇన్నోవాస్యూర్ జస్ట్ డయల్ లిమిటెడ్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఆయా కంపెనీల్లో ఉద్యోగాలు పొందేందుకు ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, బీ–ఫార్మసీ, ఎం–ఫార్మసీ, బీఎస్సీ కెమిస్ట్రీ విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం తొమ్మిది గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయన్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి జి.సుధాకర్ పర్యవేక్షణలో ఈ జాబ్‌మేళా జరుగుతుందని తెలిపారు.

పోలీసు పీజీఆర్ఎస్‌కు 28 ఫిర్యాదులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్)కు 28 ఫిర్యాదులు అందాయి. అర్జీదారులతో జిల్లా అడిషనల్ ఎస్పీ (లా) అల్లూరి వెంకట సుబ్బరాజు నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాలని కోరారు. సివిల్, కుటుంబ తగాదాలు, చీటింగ్, కొట్లాటకు సంబంధించి ప్రజలు అర్జీలు అందజేశారు.

రేపు క్యాంపస్ ఇంటర్వ్యూలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆర్ట్స్ కళాశాలలో బుధవారం దివిస్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు జరుగుతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ, బీఎస్సీ కెమిస్ట్రీ, బీ ఫార్మసీ, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ, ఎం.ఫార్మసీ, బీటెక్ కెమికల్ పాసైన యువకులు అర్హులన్నారు. దివీస్ లాబ్స్‌లో ట్రైనీ సూపర్‌వైజర్, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ పోస్టులకు ఎంపికలు జరుగుతాయన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆరోజు ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్సు కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరుకావాలన్నారు.

ఉచిత బస్సు హామీ అమలుకు కాంగ్రెస్ ధర్నా



రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

రాజమహేంద్రవరం సిటీ: సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామంటూ గద్దె నెక్కిన కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేసిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. మహిళలకు ఉచిత బస్సు హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు ధర్నా నిర్వహించారు. డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని దుయ్యబట్టారు. ఉచిత బస్సు హామీపై ప్రతి నియోజకవర్గం నుంచి వెయ్యి పోస్టుకార్డుల ఉద్యమాన్ని చేపడతామని తెలిపారు. ఆందోళనకారులు కొద్దిసేపు పల్లె వెలుగు బస్సులను అడ్డుకున్నారు. పార్టీ నాయకులు అమర్ జహా, అరుణకుమారి, మోత శారద, బాలేపల్లి మురళీధర్, డాక్టర్ వడయార్, పట్నాల శ్రీనివాస్, డాక్టర్ వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో వన్ స్టాప్ సెంటర్లలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి కె.వి జయకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా బొమ్మూరులోని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్‌లో సోషల్ వర్కర్ ఒకటి, అవుట్ రీచ్ వర్కర్ ఒకటి, ప్రత్యేక దత్తత ఏజెన్సీ యూనిట్‌లో ఆయా పోస్టు ఒకటి భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో స్టోర్ కీపర్/అకౌంటెంట్ పోస్టు ఒకటి, కుక్ పోస్టు ఒకటి(అవుట్ సోర్సింగ్), సహాయకులు కం నైట్ వాచ్‌మన్ ఒకటి (అవుట్ సోర్సింగ్), విద్యావేత్త ఒకటి (పార్ట్ టైం) భర్తీ చేయనున్నట్టు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా వన్ స్టాప్ సెంటర్‌లో సోషల్ కౌన్సెలర్ ఒకటి, కేస్ వర్కర్ ఒక పోస్టు భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. అభ్యర్థులు డిస్ట్రిక్ట్ వెబ్‌సైట్ ఈస్ట్‌గోదావరి.ఏపీ.జీవోవీ.ఐఎన్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

కలవరిమాయె..

- అల్పపీడనం ఆందోళనతో ముందుకు సాగని వరి కోతలు
- జిల్లావ్యాప్తంగా 77,817 హెక్టార్లలో సాగు
- కోతలకు సిద్ధంగా 72,246 హెక్టార్లు
- ఇప్పటి వరకు 598 విస్తీర్ణంలో మాత్రమే పూర్తి
- వర్షాలతో ఆలస్యం.. ఆందోళనలో అన్నదాత



ఆరుగాలం శ్రమించే అన్నదాతకు ప్రకృతి వైపరీత్యాలు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. విత్తు నాటినప్పటి నుంచి పంట చేతి కొచ్చే వరకూ దేవుడిపైనే భారం వేయాల్సి వస్తోంది. ప్రస్తుత పాలకుల వైఖరి నేపథ్యంలో.. గిట్టుబాటు ధర మాట దేవుడెరుగు.. కోత కోసిన ధాన్యాన్ని సురక్షితంగా చేజిక్కించుకుంటే చాలన్న తపన రైతన్నల్లో కనిపిస్తోంది. ఈ క్రమంలోనే కోతకు సిద్ధమైన వరిపంటను.. ఆకస్మిక వర్షాల కారణంగా కోయాలా, వద్దా అన్న మీమాంసలో అన్నదాతలు కొట్టుమిట్టాడుతున్నారు.

సాక్షి, రాజమహేంద్రవరం: ఖరీఫ్ వరి కోతలపై వరుణుడు కరుణ చూపడం లేదు. అల్పపీడన ప్రభావం.. తుపాను హెచ్చరికలు.. ఆపై ఆకస్మిక వర్షాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వీటన్నింటినీ అధిగమించి కోతలు చేపడదామంటే.. ఉన్నట్టుండి కురుస్తున్న వర్షం కలవరానికి గురి చేస్తోంది. కోతల సమయంలో ఒక్కసారిగా వరుణుడు ప్రతాపం చూపితే.. ధాన్యం నీటి పాలవుతుందన్న ఆందోళన రైతుల్లో గుబులు పుట్టిస్తోంది. ఈ పరిణామం కోతలపై పడుతోంది. తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా కేవలం 0.8 శాతం వరి కోతలు మాత్రమే జరిగాయంటే పరిస్థితి అవగతమవుతోంది.

జిల్లాలో ఇలా..

తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ వివిధ రకాల పంటలు 82,875 హెక్టార్లలో సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా. అందులో అత్యధికంగా వరి సాధారణ సాగు 77,817 హెక్టార్లుగా నమోదైంది. 2024–25 ఖరీఫ్ సీజన్లో సుమారు 4.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనాలు రూపొందించారు. స్థానిక అవసరాలకు పోను.. 2.30 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 220 రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.

వాతావరణ హెచ్చరికలతో ఆటంకం

తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా వరి కోతలు ప్రారంభించారు. ఈ నెలాఖరుకు పూర్తి కావాలని వ్యవసాయ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. దిగుబడి సైతం ఆశాజనకంగా ఉన్నట్టు నిర్ధారించారు. అయితే వాతావరణ హెచ్చరికలు, ఆకస్మిక వర్షాలు కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ఈ కారణంగా కోతలు నెమ్మదించాయి. తాజాగా సోమవారం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురవడం ప్రారంభం కావడంతో కర్షకుల్లో మరింత కంగారు నెలకొంది. ప్రస్తుతం వరి పంట కోతల దశలో ఉంది. వాతావరణ హెచ్చరికలను అధిగమించి కోతలకు దిగితే.. వర్షానికి ధాన్యం తడిస్తే మొదటికే మోసం వస్తుందని, అలాగని పొలాల్లో పంట అలాగే ఉంచితే వర్షపు నీటిలో మునిగిపోయే ప్రమాదం లేకపోలేదని ఆందోళన చెందుతున్నారు. ధాన్యం మొలకలు వస్తే ఎందుకూ పనికిరాకుండా పోతుందన్న మీమాంస నెలకొంది. దీంతో కోతలకు రైతన్నలు ఆచీతూచీ అడుగులు వేస్తున్నారు.

0.8 శాతం మాత్రమే కోతలు

తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా వరి కోతలు నత్తనడకన సాగుతున్నాయి. ప్రారంభించి రెండు నెలలు దాటినా, 14 శాతం కూడా దాటలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. నల్లజర్లలో అత్యధికంగా 6.6 శాతం కోతలు పూర్తయ్యాయి. రాజమండ్రి రూరల్‌లో 3.4 శాతం, రాజానగరం 2.3, గోకవరం 4 , సీతానగరం 0.2, చాగల్లు 0.6, రంగంపేట 0.2, కొవ్వూరు 1.3, గోపాలపురం 0.7, పెరవలి 0.8 శాతం కోతలు పూర్తయినట్టు గణాంకాలు చెబుతున్నాయి. అనపర్తి, బిక్కవోలు, కోరుకొండ, ఉండ్రాజవరంలో కోతలింకా ప్రారంభం కాలేదు.

2.30 లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యం

తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా స్థానిక అవసరాలకు పోను.. 2.30 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని వ్యవసాయ శాఖ లక్ష్యంగా నిర్దేశించింది. ఇందుకు గాను జిల్లావ్యాప్తంగా 220 రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ ప్రారంభించారు. క్షేత్ర స్థాయిలో ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. జిల్లాలో నల్లజర్లలో కోతలు ప్రారంభమైనా.. కొనుగోలు కేంద్రాలు తెరిచిన దాఖలాలు లేవు, వెరసి కోత చేసిన ధాన్యాన్ని ఎక్కడ నిల్వ చేయాలో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ధాన్యం సేకరణ విషయంలో భారీ వ్యత్యాసం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. గత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తి స్థాయిలో ప్రారంభమైంది.

జిల్లాలో కోతల పరిస్థితి ఇలా..

మండలం	కోతలకు సిద్ధమైన విస్తీర్ణం (హెక్టార్లలో)	కోతలు చేపట్టిన విస్తీర్ణం (హెక్టార్లలో)
రాజమహేంద్రవరం రూరల్	1,401	47
కడియం	2,015	0
రాజానగరం	4,138	95
అనపర్తి	3,623	0
బిక్కవోలు	5,696	0
కోరుకొండ	5,199	0
గోకవరం	5,389	4
సీతానగరం	5,208	10
రంగంపేట	2,433	15
చాగల్లు	3,284	20
దేవరపల్లి	3,365	8
గోపాలపురం	4,012	28
కొవ్వూరు	4,444	56
నిడదవోలు	6,935	51
పెరవలి	3,240	25
తాళ్లపూడి	3,689	5
నల్లజర్ల	3,472	230

వర్షం ఉంటే కోతలు చేపట్టవద్దు



ప్రస్తుతం అధిక వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండాలి. సార్వా వరి పంట కోతకు అనుకూలంగా ఉంది. ముఖ్యమైన సన్న రకాల కోతలు జరుగుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో అమ్మకాలు జరుగుతున్నాయి. నూర్చిన ధాన్యాన్ని వర్షానికి తడవకుండా, సురక్షిత ప్రదేశాల్లో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలి. ప్రస్తుతం వర్షాలు అధికంగా ఉన్న ప్రదేశాల్లో కోతలు పూర్తి స్థాయిలో ఆపేయాలి. పొలంలో నీరు నిలవకుండా, నీరు బయటకు వెళ్లేలా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. వర్షం తగ్గిన వెంటనే ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని కంకులపై పిచికారీ చేయాలి.

– ఎస్.మాధవరావు, వ్యవసాయాధికారి

పంచారామాలు, శబరిమలైకు ప్రత్యేక బస్సులు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం నుంచి ప్రత్యేక సర్వీసులు నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి షర్మిల అశోక తెలిపారు. సోమవారం రాజమహేంద్రవరం బస్ స్టేషన్‌లో ఈ మేరకు బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ మాసంలో ప్రతి ఆదివారం సాయంత్రం 7 గంటలకు రాజమహేంద్రవరం నుంచి బయలుదేరే సర్వీసు.. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామ, సామర్లకోట పుణ్యక్షేత్రాలను కార్తిక సోమవారం రోజున దర్శించుకుని, అదే రోజు రాత్రి 8 గంటలకు తిరిగి రాజమహేంద్రవరం చేరుకుంటుందని వివరించారు. ఈ సర్వీసులు నవంబర్ 3, 10, 17, 24, డిసెంబర్ ఒకటిన అందుబాటులో ఉంటాయన్నారు. బస్టాండ్లు, ఆన్‌లైన్‌లో టికెట్లు రిజర్వేషన్ చేయించుకోవచ్చన్నారు. శబరిమలైకు కూడా సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సులు నడుపుతున్నట్టు తెలిపారు. ఒక్కొక్కరికీ ఐదు రోజుల యాత్రకు రూ.5 వేలు, వారం రోజుల యాత్రకు రూ.6 వేలు, పది రోజుల యాత్రకు రూ.7,500 టికెట్ ధర నిర్ణయించామన్నారు. వీటికి సంబంధించిన బ్రోచర్లు, పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన టెట్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లు సోమవారంతో ప్రశాంతంగా ముగిశాయని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. చివరి రోజు ఉదయం సెషన్‌లో 243 మందికి 210, మధ్యాహ్నం సెషన్‌లో 225కి 178 మంది పరీక్షలు రాసినట్టు తెలిపారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, ప్రధానోపాధ్యాయులు కోలా సత్యనారాయణ, గణపతి వ్యవహరించారన్నారు.

చిన్నారుల ఆరోగ్యానికి ప్రాధాన్యం

- 'బంగారుకొండ ప్లస్' ఆరోగ్య శాఖతో సమన్వయం
- కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): బంగారు కొండ ప్లస్ ద్వారా పిల్లలను పూర్తి స్థాయిలో ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ఆరోగ్య శాఖతో సమన్వయం చేసుకోనున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఈ పథకానికి రూపొందిస్తున్న కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బంగారు కొండ ద్వారా పిల్లల ఎదుగుదల, పౌష్టికాహార లోపం, రక్తహీనత నుంచి కాపాడడం సత్ఫలితాలు ఇచ్చిందన్నారు. అదే స్ఫూర్తితో బంగారుకొండ ప్లస్‌కి కార్పొరేట్ సామాజిక బాధ్యతగా రూపకల్పన చేసినట్టు చెప్పారు.

అర్జీల పరిష్కారంలో నాణ్యత ఉండాలి

వచ్చే వారం నుంచి అర్జీదారులు నేరుగా సంబంధిత అధికారులను కలసి అర్జీలు అందజేస్తారని, వాటిపై అధికారులు మార్జినల్ రిమార్క్ పేర్కొంటూ ప్రతిపాదించాలని కలెక్టర్ ప్రశాంతి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జేసీ ఎస్ చిన్నరాముడు, ఇతర అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ 58, పోలీస్ 23, పంచాయతీరాజ్ 16, వ్యవసాయ శాఖ 10, ఇతర శాఖలు 37 అర్జీలు వచ్చాయి. ఆన్‌లైన్‌లో 134, ఆఫ్‌లైన్‌లో 10 అర్జీలు స్వీకరించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

113 నీటి యాజమాన్య సంఘాలకు ఎన్నికలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని 113 నీటి యాజమాన్య సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్–1 విడుదల చేసినట్టు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31న ప్రాదేశిక నియోజకవర్గాల ప్రచురణ, నవంబర్ 1, 2 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, 3న అభ్యంతరాలపై నిర్ణయం, తుది ప్రచురణ, 6 నుంచి 10 వరకు భూ యజమానుల ఓటరు జాబితా తయారీ, 11, 12 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, 13న నిర్ణయం, 20న తుది ఓటరు జాబితా ప్రకటన, అదే రోజు ఆయా కమిటీల ఎన్నికల ప్రకటన, 21 నుంచి 23 వరకు ప్రాదేశిక నియోజకవర్గాలు, నీటి యాజమాన్య సంఘాల పోలింగ్, 24 నుంచి 26 వరకు డీసీల పోలింగ్, 27 నుంచి 29 వరకు ప్రాజెక్టు కమిటీ పోలింగ్ నిర్వహిస్తారన్నారు.

అమరుల త్యాగాలు మరువలేం

- కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహ కిషోర్
- పోలీసు అమరవీరులకు ఘన నివాళులు



పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ పి ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్ తదితరులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ప్రజాస్వామ్య పరిరక్షణలో పోలీసుల త్యాగాలు మరువలేమని, వారి త్యాగాలను స్మరించుకుంటూ పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహించుకుంటామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలీసుగా ఉద్యోగంలో చేరినప్పటి నుంచి అపాయాలను ఎదుర్కొంటూ, దేనికీ బెదరకుండా విధి నిర్వహణ చేయాల్సి ఉంటుందన్నారు. దేశ రక్షణలో సైనికులు, సమాజ రక్షణలో పోలీసులు తీసుకున్న ఈ బాధ్యత ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణలో కీలకమన్నారు. పోలీసు శాఖలో పని చేసే ప్రతి అధికారి, సిబ్బంది తన కోసం కాకుండా, ప్రజల కోసమే పని చేయాల్సి ఉంటుందన్నారు. పౌర భద్రతకు మేమున్నామనే భరోసా సమాజానికి కలిగేటట్టుగా విధి నిర్వహణ చేస్తున్న పోలీసులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. ఎస్పీ డి.నరసింహ కిషోర్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఏడాది కాలంలో 214 మంది పోలీసులు అమరులయ్యారన్నారు. ఏపీలో నరేంద్ర, గణేష్ అనే ఇద్దరు పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించారని చెప్పారు. వచ్చే 11 రోజుల పాటు పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అలాగే పోలీసు కుటుంబాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. పోలీసు శాఖ అమరుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ముందుగా పోలీసు కార్యాలయంలోని అమరవీరుల స్థూపం వద్ద కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు ఘనంగా నివాళులర్పించారు. రాజమహేంద్రవరం ప్రకాశ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ పి.శ్రీదేవి విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోవడంతో ఆమె భర్త శేషుప్రసాద్‌కు అడిషనల్ కార్పస్ ఫండ్ రూ.లక్ష, ఆదరణ పథకంలో రూ.లక్ష, ఫ్లాగ్ ఫండ్ పథకంలో రూ.25 వేల చెక్కులను ఎస్పీ అందజేశారు. ఏఆర్ విభాగంలో విధి నిర్వహణలో వి.శ్రీనివాసరావు మరణించడంతో.. ఆయన భార్య నాగమణికి అడిషనల్ కార్పస్ ఫండ్ రూ.లక్ష చెక్కును అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్, ఏఎస్పీ అల్లూరి వెంకట సుబ్బరాజు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ అనసూరి శ్రీనివాసరావు , డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, సిబ్బంది హాజరై, పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు.

పచ్చ పార్టీలో కొత్త చిచ్చు

- ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నికలో మరోసారి బయటపడ్డ వర్గ విభేదాలు
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాజశేఖర్
- చక్రం తిప్పిన యనమల, నిమ్మకాయల
- 'మెట్ల'కు చెక్ పెట్టిన చినరాజప్ప
- భంగపడ్డ మాజీ ఎమ్మెల్యే పిల్లి దంపతులు



యనమల రామకృష్ణుడు



నిమ్మకాయల చినరాజప్ప



పేరాబత్తుల రాజశేఖర్



మెట్ల రమణబాబు



పిల్లి సత్తిబాబు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు తెలుగుదేశం పార్టీలో చిచ్చు రేపాయి. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగిన దగ్గర నుంచి ఆ పార్టీలో ఆశావహులు ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద క్యూ కట్టారు. ఎవరికి వారు పార్టీ అభ్యర్థిత్వం తమకంటే తమకు దక్కుతుందని ఆశల పల్లకీలో ఊరేగారు. ఇందుకోసం ఆశావహులు చేయని ప్రయత్నం అంటూ లేదు. ఇంతలో చంద్రబాబు పార్టీ అభ్యర్థిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండల జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పేరాబత్తుల రాజశేఖర్‌ను ప్రకటించారు. పార్టీ గద్దెనెక్కిన దగ్గర నుంచి ఈ ఎమ్మెల్సీ పేరు చెప్పి ఊరించి ఊరించి ఉసూరుమనిపించారని పార్టీ సీనియర్ నేతలు అధిష్టానంపై అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. ఎమ్మెల్సీ ప్రాతినిధ్యం కోసం మొదటి నుంచీ రేసులో ఉన్న పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ వర్మకు ఈసారి కూడా భంగపాటు తప్పలేదు.

పిల్లి సత్తిబాబు ఆశలపై నీళ్లు

బీసీలలో బలమైన శెట్టిబలిజ సామాజికవర్గం నుంచి పార్టీ సీనియర్ నాయకుడు, కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి భర్త సత్తిబాబు ఆశలు పెంచుకున్నారు. తనకు కాకపోయినా తన భార్య అనంతలక్ష్మికి మహిళ, బీసీ కోటాలో ప్రాతినిధ్యం కల్పిస్తారని గట్టి నమ్మకంతో ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పొత్తులో భాగంగా కాకినాడ రూరల్ నియోజకవర్గాన్ని జనసేనకు త్యాగం చేసి, ఆ పార్టీ అభ్యర్థి పంతం నానాజీ గెలుపు కోసం మొదటి రోజు నుంచి తమ నాయకుడు చిత్తశుద్ధితో పనిచేశారని సత్తిబాబు వర్గీయులు పేర్కొంటున్నారు. పార్టీలో బీసీలను కూడగట్టినందుకు పార్టీ అధిష్టానం తగిన ప్రాతినిధ్యం కల్పిస్తుందని లెక్కలేసుకున్నారు. ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు కూడా పలు సందర్భాల్లో స్పష్టమైన హామీ కూడా ఇచ్చారని సత్తిబాబు వర్గం చెబుతోంది. అసెంబ్లీ నుంచి కాకున్నా మండలి నుంచి అవకాశం లభిస్తుందని భరోసా ఇచ్చి ఇప్పుడు ఇలా తమ నాయకుడిని అవమానిస్తారా అని ఆ వర్గం మండిపడుతోంది. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీని నమ్ముకుని వెన్నంటి నిలిచినందుకు ఇచ్చే గౌరవం ఇదేనా అంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బీసీ సామాజికవర్గంలో శెట్టిబలిజలకు ఒకే ఒక అసెంబ్లీ స్థానాన్ని కేటాయించడంతో ఎమ్మెల్సీ అవకాశం కల్పిస్తారని తాము వేసుకున్న అంచనాలు కాస్తా తల్లకిందులయ్యాయంటున్నారు. ఆ సామాజికవర్గం నుంచి పిల్లి అనంతలక్ష్మి దంపతులతో పాటు, పెంకే శ్రీనివాసబాబా వంటి నాయకులు కూడా ఎమ్మెల్సీ స్థానాన్ని చివరి వరకు ఆశించి భంగపాటుకు గురయ్యారు. యనమలకు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కూడా జత కలిసి తమకు ఎమ్మెల్సీ రాకుండా చెక్ పెట్టారని సత్తిబాబు వర్గం బలంగా నమ్ముతోంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు చినరాజప్ప పెద్దాపురం నుంచి కాకినాడ రూరల్ స్థానానికి మారతారనే ప్రచారం జరిగింది. అప్పట్నుంచీ చినరాజప్ప, పిల్లి సత్తిబాబు మధ్య వైషమ్యాలు పొడచూపాయి. ఈ వర్గాలు పరస్పరం చేసుకున్న విమర్శలు, ప్రతి విమర్శలు అప్పట్లో కాకినాడ రూరల్ రాజకీయాన్ని వేడెక్కించాయి. అవన్నీ మనసులో పెట్టుకునే చినరాజప్ప సీనియర్ నాయకుడు యనమలతో కలిసి ఎమ్మెల్సీ విషయంలో దెబ్బతీశారని ఆ వర్గం అనుమానిస్తోంది.

వైఎస్సార్ సీపీలోనే శెట్టిబలిజలకు ప్రాధాన్యం

సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీలో శెట్టిబలిజ సామాజికవర్గానికి ఒకే ఒక అసెంబ్లీ స్థానం రామచంద్రపురం కేటాయించారు. ఈ నేపథ్యంలోనే పట్టభద్రుల ఎమ్మెల్సీలో ప్రాతినిధ్యం కచ్చితంగా ఉంటుందని ఆ సామాజికవర్గ నేతలు ఆశించారు. అదే వైఎస్సార్ సీపీకి వచ్చేసరికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు అసెంబ్లీ స్థానాలు రాజమహేంద్రవరం రూరల్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రామచంద్రపురం నుంచి మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ తనయుడు సూర్యప్రకాష్‌కు ఇచ్చింది. అలాగే ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు అధ్యక్షుడిగా ఉన్న కుడుపూడి సూర్యనారాయణరావుకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి అగ్రాసనం వేసింది. అలా వైఎస్సార్ సీపీలో శెట్టిబలిజలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడాన్ని వారు ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు. టీడీపీలో మాత్రం సరైన గుర్తింపు ఇవ్వడం లేదని పార్టీలో ఆ సామాజిక వర్గీయులు తీవ్ర నిరాశతో ఉన్నారు. చంద్రబాబు మాత్రం బీసీలకే పెద్దపీట వేస్తున్నామని గొప్పలకు పోతున్నారంటున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న సీనియర్లకు కూడా మొండిచేయి చూపించారని ఆవేదన చెందుతున్నారు.

ఒకే దెబ్బకు రెండు పిట్టలు!

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో టీడీపీలో తొలితరం సీనియర్ నాయకుడు, దివంగత మాజీ మంత్రి డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు తనయుడు మెట్ల రమణబాబు కూడా ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని ఆశించారు. పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ ఇటీవల ఎన్నికల్లో అమలాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గెలుపులో కృషి చేసినప్పటికీ ప్రాతినిధ్యం లేకుండా చేశారని ఆయన అనుచరులు ఆవేదన చెందుతున్నారు. అమలాపురం నియోజకవర్గం షెడ్యూల్డ్ కులాలకు రిజర్వు కావడంతో ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం రమణబాబుకు దక్కుతుందని ఆ వర్గం ఆశించింది. కోనసీమ జిల్లాలో మెట్ల రమణబాబుకు అవకాశం కల్పించకున్నా అదే సామాజికవర్గం నుంచే పేరాబత్తుల రాజశేఖర్ అభ్యర్థిత్వం ఖరారు చేశామని పార్టీ అగ్ర నేతలు సమర్థించుకుంటున్నారు. మెట్లతో వైరివర్గంగా ఉన్న ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెర వెనుక రాజశేఖర్‌కు మద్దతుగా పావులు కదిపి రమణబాబుకు చెక్ పెట్టారని చర్చ జరుగుతోంది. ఒక దెబ్బకు రెండు పిట్టలు అన్నట్టుగా చినరాజప్ప వ్యూహాత్మంగా వ్యవహరించారు. అక్కడ రమణబాబును దెబ్బతీసేందుకు రాజశేఖర్ని తెరపైకి తెచ్చి ఇటు పిల్లి సత్తిబాబును దెబ్బతీశారు.. ఇదంతా చినరాజప్ప, యనమల కలిసి ఆడిన రాజకీయ చక్రవ్యూహంగా పార్టీ నేతలు భావిస్తున్నారు. రమణబాబు రాజకీయ ఎదుగుదలను కట్టడి చేసేందుకే చినరాజప్ప వ్యూహాత్మకంగా వ్యవహరించి రాజశేఖర్‌కు సానుకూలంగా మద్దతు కూడగట్టారని మెట్ల వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

క్లుప్తంగా

ఏడుగురికి జైలు

గండేపల్లి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఏడుగురికి జైలు శిక్ష, ఆరుగురికి జరిమానా విధించినట్లు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. వారం రోజులుగా గండేపల్లి, కిర్లంపూడి, జగ్గంపేట పోలీస్ స్టేషన్ల వద్ద నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి పెద్దాపురం కోర్టులో హాజరుపరిచారు. ఆరుగురిలో ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున జరిమానా, మరో ఏడుగురికి రెండు రోజులపాటు జైలు శిక్షను పెద్దాపురం కోర్టు తీర్పు వెలువరించింది. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని సీఐ చెప్పారు.

రైల్వే ప్లాట్‌ఫారంపై వ్యక్తి మృతి

తుని: అన్నవరం రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై ఓ వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి (40) అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు ముదురు నీలం రంగు టీ షర్ట్, ముక్కుపొడుం రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచారు. వివరాలకు 94906 19020 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక రైల్వే స్టేషన్ రెండో నంబర్ ప్లాట్‌ఫామ్ వద్ద రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు (30) సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని రైల్వే స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్‌ఎన్‌డీ మణి తెలిపారు. మృతుడు నీలం రంగు అడ్డ చారల చొక్కా, మిలటరీ రంగు లోయర్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుడి కుడి చేయి మణికట్టుపై ఐశ్వర్ అనే పచ్చబొట్టు ఉందన్నారు. అతని వివరాలు తెలిసిన వారు రాజమహేంద్రవరం జీఆర్పీ స్టేషన్ నంబర్లను 0883 2442821, 89193 09442లను సంప్రదించాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మణి వివరించారు.

జేఎన్‌టీయూకేలో ఆహార దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ, అసోసియేషన్ ఆఫ్ ఫుడ్ సైంటిస్ట్స్ టెక్నాలజిస్ ఇండియా (ఏఎఫ్‌ఎస్‌టీఐ) కాకినాడ చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో మెరుగైన జీవితం - మంచి భవిష్యత్తు కోసం ఆహార హక్కు అనే నినాదంతో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి స్థానిక జేఎన్‌టీయూలోని అలూమ్ని ఆడిటోరియం వేదికైంది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఆహారంతోనే మానవ జీవితం ముడిపడి ఉందన్నారు. ఫుడ్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, నూతన ఆవిష్కరణలపై పరిశోధనలు చేయాలని సూచించారు. విశిష్ట అతిథి, విశాఖపట్నంలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (సీఐఎఫ్‌టీ) ఎమిరిటస్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.ముక్తేశ్వర్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి మనిషి తన జీవితంలో సుమారు 35 టన్నుల ఆహారాన్ని తీసుకుంటారన్నారు. రెక్టార్ కేవీ రమణ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం జంక్ ఫుడ్‌ను విడనాడాలన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఆహార ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకుని జేఎన్‌టీయూకేలో లైఫ్ సైన్సెస్ కోర్సులను ప్రారంభించామన్నారు. ముందుగా కార్యక్రమానికి జేఎన్‌టీయూకే స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం.రమేష్ అధ్యక్షత వహించగా, అతిథులు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఏఎఫ్‌ఎస్‌టీఐ కాకినాడ చాప్టర్ సెక్రటరీ ఎం.చంద్రిక, జేఎన్‌టీయూకే ఐక్యూఏసీ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సదా వేంకటేశం.. స్మరామి స్మరామి

- వాడపల్లి స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఆత్రేయపురం: సదా వేంకటేశం స్మరామి స్మరామి.. హరే వేంకటేశం ప్రసీద ప్రసీద అంటూ ఆ వాడపల్లి స్వామిని భక్తజనం కొలిచింది.. కోనసీమ తిరుపతిగా ఖ్యాతిగాంచిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి స్వస్తి వచనం, విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, అగ్నిప్రతిష్ఠాపన, దిగ్దేవత ప్రార్థన, విశేషార్చన, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు మృత్సంగ్రహణ, శాలావిహరణ, అంకురార్పణ, వాస్తుపూజ, అగ్నిమథనం, త్రేతాగ్ని ప్రణయనం, వాస్తుహోమం, ధ్వజపతాక హోమాలు, నవమూర్తి అవాహన, భేరీ పూజ, ధ్వజారాహోణ, బలిహరణ, నీరాజనం తదితర పూజా కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం పరావాసుదేవ అలంకరణలో శేషవాహన సేవ తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు.



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు



శేష వాహనంపై స్వామివారికి ఊరేగింపు

ఉదయం స్వామివారిని తీర్థ బిందెతో గోదావరి జలాలను తీసుకువచ్చి స్వామివారికి ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ అనంతరం అభిషేకాలుతో పాటు గోత్రనామాలతో పూజలు, నిత్య హోమాలు జరిగాయి. బ్రహ్మోత్సవ కార్యక్రమాలను దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో వైఖానస యువబ్రహ్మ ఆగమ భాస్కర ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పట్టువస్త్రాలను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దంపతులు సమర్పించారు. అలాగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయం వద్ద ఎస్సై రాము ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

శేషవాహనం విశిష్టత

బ్రహ్మోత్సవ సమయంలో శేష వాహనంపై పరావాసుదేవ అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వాహనంపై స్వామివారిని దర్శిస్తే వైకుంఠంలో శ్రీమన్నారాయణను చూసిన ఫలితం లభిస్తుందని భక్తుల విశ్వాసం. వైకుంఠంలో స్వామివారు శేష వాహనంపై పాన్పులో ఉంటారు. బ్రహ్మోత్సవాల్లో ప్రథమ వాహనం శేషవాహనం కావడంతో భక్తులు దర్శించుకుంటే మంచి జరుగుతుందని నమ్మకం.

స్వామిని కీర్తిస్తూ జనపద గీతాలాపన →



వాడపల్లి వేంకటేశ్వరస్వామి

నేటి కార్యక్రమాలు ఇవీ..

మంగళవారం ఉదయం స్వామివారికి శోభ యాత్రగా గోదావరి నదీ జల సంగ్రహణ, మహా పుష్పయాగం, సాయంత్రం సహస్ర దీపాలంకరణ, సరస్వతీ అలంకరణతో హంస వాహన సేవ తదితర పూజలు నిర్వహిస్తారు.



ఫ్లైఓవర్ పనుల జాప్యంపై సమీక్ష



జొన్నాడలో ఫ్లైఓవర్ పనులపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బండారు తదితరులు

సాక్షి ఇంపాక్ట్

ఆలమూరు: 216ఏ జాతీయ రహదారిలోని జొన్నాడలో సుమారు రూ.60 కోట్లతో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనుల జాప్యంపై సమీక్ష జరిగింది. ఈ నెల 19న ‘సాక్షి’ దినపత్రికలో ‘జొన్నాడలో జోరేది’ అనే శీర్షికన వచ్చిన కథనానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్పందించారు. దీంతో హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ సురేంద్రనాథ్, ప్రాజెక్టు మేనేజర్ బాలసుబ్రహ్మణంతో పాటు సృష్టి కన్‌స్ట్రక్షన్‌కు చెందిన ప్రతినిధులతో ఆయన సోమవారం సమీక్ష నిర్వహించారు. ఫ్లైఓవర్ పనుల జాప్యానికి గల కారణాలు, ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రాజమహేంద్రవరం మాదిరిగానే జొన్నాడలో పనులు ఎందుకు చేపట్టలేదని నిలదీశారు. దీనిపై హైవే అధికారులు, కాంట్రాక్ట్ ప్రతినిధులు స్పందిస్తూ వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి ఫ్లైఓవర్‌ను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఈ నిర్మాణ పనులను అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. రాష్ట్ర తెలుగు రైతు సంఘ ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, మాజీ ఉప సర్పంచ్ తాడి శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొడవర్తి బాబీ పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్దని నిరసన



ఏలేశ్వరంలో ఆందోళన చేస్తున్న స్థానికులు

ఏలేశ్వరం: జనావాసాల మధ్య మద్యం దుకాణం వద్దని ఏలేశ్వరంలో సోమవారం స్థానికులు ధర్నా నిర్వహించారు. స్థానిక మెయిన్‌రోడ్‌ను ఆనుకుని మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు వ్యాపారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద స్థానికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం మహిళలు రాకపోకలు సాగించే ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం దారుణమన్నారు. దుకాణానికి వచ్చే మందుబాబులతో మహిళలకు అవస్థలు తప్పవన్నారు. దీనిపై వెంటనే అధికారులు స్పందించి మద్యం దుకాణం ఏర్పాటును అడ్డుకోవాలన్నారు. అనంతరం కమిషనర్ సత్యనారాయణ, ఎస్సై రామలింగేశ్వరరావు, తహసీల్దార్ వెంకటేశ్వరరావులకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. వీరికి వైఎస్సార్ సీపీ నాయకులు సామంతుల సూర్యకుమార్, సిరిపరపు రాజేష్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జామి బ్రహ్మం, ఉగ్గిరాల శ్రీను, జామి రాఘవ, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్‌లో పతకాల పంట



జిమ్నాస్టిక్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులతో డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): గుంటూరు జిల్లాలో ఈ నెల 17 నుంచి 19 వరకూ జరిగిన రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్ సోమవారం తెలిపారు. ఇందులో డీఎస్‌ఏ జిమ్నాస్టిక్స్ కోచ్ సురేష్ వద్ద శిక్షణ పొందుతున్న క్రీడాకారులు 17 బంగారు, 15 రజత, 14 కాంస్య పతకాలు సాధించారని అన్నారు. డిసెంబర్ 25 నుంచి గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో అండర్-10 బాలికలు మినహా మిగిలిన వారు అంతా పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోచ్ సురేష్‌ను డీఎస్‌ఏలో జరిగిన కార్యక్రమంలో డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ అభినందించారు. అండర్-10 బాలికల విభాగంలో మోక్షశ్రీ 2 బంగారు, ఎం.పల్లవి 2 వెండి, మహిజైన్ బంగారు పతకం అందుకున్నారు. అండర్-12 బాలుర విభాగంలో లెహర్ వల్లీసాయి ప్రసాద్5 బంగారు, వెండి, బి.కార్తికేయ వెండి, 5 కాంస్య పతకాలు, బాలికల విభాగంలో సహస్ర 2 బంగారు, అనియాజైన్ ఒక బంగారు కైవసం చేసుకున్నారు. జూనియర్స్ బాలికల విభాగంలో లక్ష్మీ పద్మలత బంగారు, వెండి, కాంస్య పతకాలు, ఎన్.వెంకట జోష్నిక వెండి, జీవిక కాంస్య పతకం గెలుచుకున్నారు. జూనియర్ బాలుర విభాగంలో శివగణేష్ వీరబాబు మూడు బంగారు, మూడు వెండి, సాయి అభిరాం కాంస్య, ప్రేమ్‌కుమార్ వెండి, సీనియర్ మహిళల విభాగంలో కావ్యసాయిశ్రీ కాంస్య, పురుషుల విభాగంలో చంద్రస్వరూప్ బంగారు, రెండు వెండి పతకాలు, కాంస్య పతకం కైవసం చేసుకున్నారని శ్రీనివాస్ కుమార్ తెలిపారు.

తాతా మనవడిపై దాడి

ముమ్మిడివరం: మురుగు కాలువ పక్కన ప్రభుత్వ భూములో బడ్డీ కొట్టు పెట్టుకుంటే గ్రామంలో కొంత మంది దానిని తొలగించి, తనపై తన మనవడిపై దాడి చేశారని నగర పంచాయతీ సోమిదేవర పాలేనికి చెందిన వస్త్రాల సుబ్రహ్మణ్యం సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామానికి చెందిన కొంతమంది తాను ఏర్పాటు చేసిన బడ్డీకి తాడు కట్టి ట్రాక్టర్‌తో ఊరు బయటకు లాగేశారని, అడ్డుకునే ప్రయత్నంలో తనపై, తన మనవడు అతికల గణేష్‌పై దాడి చేశారని సుబ్రహ్మణ్యం ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఘటనపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని అన్నాడు.

శుభకార్యానికి వెళ్తుండగా...



గోపవరం వద్ద స్కూటీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు



బెల్లంకొండ వెంకటేశ్వరరావు మృతదేహం



బెల్లంకొండ దుర్గ మృతదేహం

- భార్యాభర్తల మృతి
- గోపవరం జంక్షన్‌లో ఘటన

నిడదవోలు రూరల్: మరో ఐదు నిమిషాల్లో శుభకార్యానికి చేరుకుని బంధుమిత్రులతో సంతోషంగా గడపాల్సిన ఆ దంపతులిద్దరూ మృత్యువాత పడ్డారు. ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో స్కూటీపై వెళ్తున్న భార్యాభర్తలు ప్రాణాలు కోల్పోయిన ఘటన నిడదవోలు మండలం గోపవరం జంక్షన్ త్రీవే హోటల్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం పైడిపర్రుకు చెందిన భార్యాభర్తలు బెల్లంకొండ వెంకటేశ్వరరావు (60), దుర్గ (50)లు స్కూటీపై ఇంటి వద్ద బయలుదేరి కొవ్వూరు మండలం మద్దూరులోని బంధువులైన టేకుమూడి శ్రీను ఇంట్లో ఉయ్యాల ఫంక్షన్‌కు వెళుతున్నారు. గోపవరం జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా రాజమహేంద్రవరం నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వెంకటేశ్వరరావు, దుర్గలు తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతులు వెంకటేశ్వరరావు బంటామేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి కొడుకు, కూతురు ఉండగా ఇద్దరికీ పెళ్లిళ్లు జరిగాయి. ఆర్టీసీ బస్సు డ్రైవర్ వెలగన వీరబాబు నిర్లక్ష్యంగా బస్సు నడపడంతో తన తల్లిదండ్రులు మృతిచెందారని కొడుకు పద్మారావు ఫిర్యాదు ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు తెలిపారు.

నమ్మించి మోసం చేశారని ధర్నా



అమలాపురం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బాధితులు

అమలాపురం రూరల్: కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన పాస్టర్ ఆకుల షాలేమ్‌రాజు, అతని భార్య బోనం జ్యోతి, రాజోలు చెందిన బొల్లి చిరంజీవిలు ఇజ్రాయెల్ దేశం పంపిస్తామని చెప్పి నమ్మించి మోసం చేశారని కోనసీమ జిల్లాకు చెందిన బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. నెలకు రూ.లక్షకు పైబడి ఇండియన్ కరెన్సీ వస్తుందని నమ్మించి మోసం చేశారని బాధితులు అమలాపురం కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. తమ నుంచి ముందుగా రూ.మూడు లక్షల చొప్పున తీసుకున్నారన్నారు. షాలేమ్‌రాజు పాస్టర్‌గా పనిచేయడంతో నమ్మి డబ్బులు ఇచ్చామని బాధితులు తెలిపారు. మొత్తం అందరి నుంచి రూ.1.50 కోట్లు తీసుకున్నట్లు చెప్పారు. తమకు న్యాయం చేయాలని కలెక్టర్ మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ కృష్ణారావుకు బాధితులు ఫిర్యాదు చేశారు. డబ్బులు అడిగితే చంపుతామని వారు బెదిరిస్తున్నారని ఆరోపించారు. అమలాపురం, రావులపాలెం, రాజోలు, పి.గన్నవరం, అంతర్వేది, పాలకొల్లు, ఒంగోలు పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది మోసపోయారని వివరించారు.

ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్ల దాఖలు పూర్తి

- జిల్లా నుంచి 1,487 ప్రాజెక్టుల నమోదు
- గతంతో పోలిస్తే 163 తక్కువ

రాయవరం: విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక అంశాలపై ఆసక్తి పెంచి సరికొత్త ఆవిష్కరణలు రూపొందించేలా డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు ఏటా ఇన్‌స్పైర్ మనక్ విజ్ఞాన మేళాను నిర్వహిస్తున్నారు. ఆవిష్కరణల రూపకల్పనకు ప్రభుత్వం విద్యార్థులకు ప్రోత్సాహకంగా నగదును అందిస్తూనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి నగదు పారితోషికాలను అందజేస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల నుంచి నామినేషన్లు ఆహ్వానించారు. ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి గరిష్ఠంగా మూడు, ఉన్నత పాఠశాలల నుంచి గరిష్ఠంగా ఐదు నామినేషన్ల చొప్పున ఆహ్వానించారు. జూలై 1వ తేదీ నుంచి ఈ నెల 15వ తేదీ వరకు విద్యార్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. గత విద్యా సంవత్సరంలో జిల్లా నుంచి 1,650 నామినేషన్లు రాగా, ఈ విద్యా సంవత్సరంలో 1,487 నామినేషన్లు పాఠశాలల నుంచి నమోదు కావడం గమనార్హం. అయితే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కోనసీమ జిల్లా మొదటి స్థానంలో ఉంది.

ఎంపికైతే రూ.పది వేలు

జిల్లాలో 6-10 తరగతి చదువుతున్న ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులు నూతన ఆలోచనలతో సజనాత్మక ఆవిష్కరణలు రూపొందించాలి. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఎంపిక చేసిన వినూత్న ఆలోచనలు కలిగిన ప్రాజెక్టుకు రూ.10 వేలను విద్యార్థి ఖాతాలో జమ చేస్తారు. ప్రాజెక్టు తయారీ, జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనలో పాల్గొనేందుకు వీటిని ఖర్చు చేయాల్సి ఉంది. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన జిల్లా ఇన్‌స్పైర్ మనక్‌ను వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించే అవకాశముంది. గత విద్యా సంవత్సరానికి జిల్లా వ్యాప్తంగా 136 ప్రాజెక్టులు ఇన్‌స్పైర్ మనక్‌కు ఎంపికయ్యాయి. ఎంపికైన ప్రాజెక్టుల వివరాలను ఇప్పటికే ఆయా పాఠశాలలకు జిల్లా విద్యాశాఖ తెలియజేసింది.

మంచి స్పందన కనబర్చారు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 74 ప్రాథమికోన్నత, 236 ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రైవేట్ యాజమాన్యంలో 170 ప్రాథమికోన్నత, 157 ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల నుంచి 1,487 నామినేషన్లు 2024-25 విద్యా సంవత్సరానికి నమోదు చేశారు. ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు, ఉన్నత పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులు రూపొందించి, నమోదు చేశారు.

నాణ్యమైన ప్రాజెక్టులకు అవకాశం



ఈ విద్యా సంవత్సరంలో నమోదైన ప్రాజెక్టుల్లో నాణ్యమైన ప్రాజెక్టుల నమోదుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించాం. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ఉపాధ్యాయులు ఇన్‌స్పైర్ మనక్ ఆవిష్కరణలకు మంచి స్పందన కనబర్చారు. అయితే గతేడాదితో పోలిస్తే స్వల్పంగా నామినేషన్ల దాఖలు తగ్గింది.

–జీవీవీఎస్ సుబ్రహ్మణ్యం, కోనసీమ జిల్లా సైన్స్ అధికారి

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన వెంకటరత్నాన్ని అభినందిస్తున్న జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో శిక్షణ పొందుతున్న బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగి బీహెచ్ వెంకటరత్నం పవర్ లిఫ్టింగ్ జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. విజయవాడలో ఈ నెల 18న జరిగిన బీఎస్‌ఎన్‌ఎల్ ఏపీ సర్కిల్ పవర్ లిఫ్టింగ్ సెలక్షన్స్ ట్రైల్స్‌లో వెంకటరత్నం 83 కిలోల విభాగంలో అత్యుత్తమ ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు.ఆయన వచ్చే నెల నవంబర్ 11 నుంచి 13వ తేదీ వరకూ గౌహతిలో జరగనున్న 20వ ఆల్ ఇండియా బీఎస్‌ఎన్‌ఎల్ పవర్ లిఫ్టింగ్ జాతీయ స్థాయి పోటీలకు ఏపీ సర్కిల్ నుంచి ఎంపికైనట్లు ఆ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ వద్ద నుంచి సెలక్షన్ ఆర్డర్ వచ్చింది. తమ జిమ్‌లో శిక్షణ పొందుతూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వెంకటరత్నాన్ని అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు అభినందించారు. జిమ్‌లో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు అధ్యక్షతన సోమవారం ఉదయం జరిగిన అభినందన సభలో వెంకటరత్నం జాతీయ స్థాయి పోటీల్లోనూ విజేతై తిరిగి రావాలని అందరూ ఆకాంక్షించారు. జిల్లా అసోసియేషన్ తరపున అధ్యక్షుడు కృష్ణ పద్మరాజు ఆయన్ని ఘనంగా సత్కరించారు. జిల్లా అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మట్టపర్తి సముద్రం, ప్రతినిధులు ముత్తాబత్తుల వెంకటరమణ, పద్మావతి పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు పదేళ్ల జైలు

పెద్దాపురం/ గండేపల్లి: గండేపల్లి వద్ద 2015లో 16 మంది ప్రయాణికుల మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి కమ్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి డాక్టర్ దీప దైవకృప సోమవారం తీర్పు ఇచ్చారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసుక్యూటర్ రాగం కామేశ్వరరావు కథనం ప్రకారం.. 2015 సెప్టెంబర్ 14న విజయవాడ నుంచి సిమెంట్ పౌడర్ లోడుతో విశాఖ వెళుతున్న లారీ డ్రైవర్ విజయవాడలో 34 మందిని కత్తిపూడి వరకూ ఎక్కించుకున్నాడు. గండేపల్లి శివారుకు లారీ వచ్చేసరికి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును రాసుకుంటూ పక్కకు బోల్తా పడడంతో సిమెంట్ యాష్ ప్రయాణికులపై పడి 16 మంది అక్కడికక్కడే మృతి చెందగా, మరో 10 మంది గాయపడ్డారు. దీనిపై వాదోపవాదాల అనంతరం తీర్పు వెలువరించారు. ఈ ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ జోగా శ్రీనుకు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.పది వేల జరిమానా, అలాగే క్లీనర్ బొట్టా లోవరాజుకు ఏడాది పాటు జైలుశిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించారు.